## క్లుప్తంగా

### నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రైతువేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీ బృందాలతో గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన తనిఖీ నివేదికలను ప్రజా వేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు.

### ప్రభుత్వ బావిని పరిరక్షించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రహమత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ బావిని అధికారులు పరిరక్షించాలని సోమవారం కాలనీవాసులు బాలేశ్, మహేశ్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాల నిర్వాహకులు ప్రభుత్వ బావిలో చెత్తాచెదారం నింపి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బావి ఆక్రమణకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీవాసులు సాబీర్ అలీ, తయాబ్, గణేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

### నేడు వీవోల సర్వసభ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 34 వీవోల అధ్యక్షులు డీసీబీ, పొదుపు చెక్కులతో సకాలంలో హాజరు కావాలన్నారు. సంబంధిత సీసీలు, వీవోఏలు వీవో అధ్యక్షులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### సీసీలకు సమీక్ష

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు ఐకేపీ సీసీలకు సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి డీపీఎం సారయ్య, అన్నాజి వస్తున్నారని సకాలంలో సీసీలు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

### నేడు రెండో విడత టీచర్లకు శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులకు మంగళవారం రెండో విడ త శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సోమవారం ఒక ప్ర కటనలో తెలిపారు. ఈ శిక్షణ ఐదు రోజుల పాటు ఉంటుందని, తెలుగు, హిందీ, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం సబ్జెక్టు ఉపాధ్యాయులు శి క్షణకు హాజరుకావాలని సూచించారు. ఉద యం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వ రకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నా రు.

### ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న గంగాసింగ్

నార్నూర్: మండల ఎంపీడీవోగా గంగాసింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఎంపీడీవో జవహర్ లాల్‌ను జెడ్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గంగాసింగ్‌ను ఎంపీవో సాయిప్రసాద్, ఈజీఎస్ ఏపీవో సురేందర్ రాథోడ్, సిబ్బంది శాలవాతో సన్మానించారు.

### ఏజెన్సీ ఎస్సీలకు పహానీ పత్రాలు ఇవ్వాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా నివాసముంటున్న ఎస్సీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు వారు సాగు చేస్తున్న భూములకు సర్వే నిర్వహించి రుణ సౌకర్యార్థం పహానీ పత్రాలు ఇవ్వాలని ప్రధాన్ పురోహిత్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్సీలకు కనీస హక్కులు కూడా లేవన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఏజెన్సీ ఎస్సీల విషయంలో సానుకూలంగా ఉన్నారన్నారు.

### జొన్న కొనుగోళ్లు నిలిపివేత

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంలో జొన్న పంట నిల్వలు ఎక్కువగా ఉండడం, వాతావరణంలో మార్పులు రావడంతో ఈ నెల 20 నుంచి 22 వరకు జొన్న కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23 నుంచి పంట అమ్మకానికి తీసుకొచ్చి సహకరించాలని ప్రకటనలో కోరారు.

# ప్రమాదాల రహదారులు..!

- హెచ్చరిక బోర్డులు లేవు
- చెట్లతో ఇరుకుగా రోడ్లు
- నిబంధనలు పాటించని వాహనదారులు


ప్రమాదాలు జరిగే ఒక మూలమలుపు


కదంబా మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

చింతలమానెపల్లి: రహదారి భద్రత.. ప్రయాణికులు సైతం బాధ్యతగా వ్యవహరించినప్పుడే సాధ్యపడుతుంది. మండలంలోని రహదారులపై భద్రతా ప్రమాణాలు కొరవడగా మరోవైపు నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. చింతలమానెపల్లి మండలం మహారాష్ట్ర, తెలంగాణల రవాణాకు మార్గంగా ఉంది. కౌటాల నుంచి చింతలమానెపల్లి మీదుగా బెజ్జూర్, పెంచికల్‌పేట్ రహదారి, డబ్బా మీదుగా మరో రహదారి, మహారాష్ట్రలోని అహేరి, ఆళ్లపల్లి, ఏటపల్లి, చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి వెళ్లడానికి చింతలమానెపల్లి గూడెం మీదుగా రహదారులు ఉన్నాయి. కాగజ్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రయాణికులు ఈమార్గాలను వినియోగించుకుంటున్నారు.

#### పెరుగుతున్న రద్దీ

గత కొన్నేళ్లుగా మండలంలోని వివిధ మార్గాల నుంచి రద్దీ గణనీయంగా పెరిగింది. మండలం నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి, మహారాష్ట్రకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం ఈ రహదారులను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో గత రెండు నెలలుగా ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. వ్యవసాయ ఉత్పత్తులను తరలించే సీజన్‌లో ఈమార్గాలు మరింత రద్దీగా మారుతున్నాయి. మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం మార్గంలో నిబంధనలు ఉల్లంఘించి కంకరను మహారాష్ట్రకు భారీ టిప్పర్లలో తరలిస్తుండగా రహదారులపై నిత్యం రద్దీ కొనసాగుతోంది.

#### ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు..

- చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ 1 నుంచి కౌటాల వెళ్లే మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- చింతలమానెపల్లి మండల కేంద్రం నుంచి బాలాజీఅనుకోడ మార్గంలో గతంలో పలు ప్రమాదాలు నమోదయ్యాయి.
- మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం మార్గంలో కేతిని సమీపంలో, చిత్తామ, గూడెం గ్రామాల సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి.
- బాబాసాగర్ నుంచి కొత్తగూడెం క్రాస్‌రోడ్ సమీపంలో రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- డబ్బా గ్రామం నుంచి అడెపెల్లి, కదంబా మార్గంలో అడెపల్లి గ్రామం సమీపంలో, భీమన్న ఆలయం సమీపంలో మలుపులు, కదంబా గ్రామం సమీపంలో ప్రమాదాలు చోటు చేసుకోవడం సాధారణంగా మారింది.

#### ప్రమాదాలు.. కారణాలు..

మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం, డబ్బా నుంచి కదంబా మార్గం కాగజ్‌నగర్ వరకు అటవీ ప్రాంతం గుండా వెళ్తున్నాయి. ఈమార్గాలలో దట్టమైన అడవులు ఉండగా రహదారి మలుపులతో ఉంది. ఖర్జెల్లి నుంచి గూడెం మార్గంలో ప్రతీ ఏడాది నిత్యం 40కి పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కదంబా అటవీ మార్గంలో సైతం ఇదే పరిస్థితి ఉంది. ఏటా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రమాదాలలో తీవ్ర గాయాలపాలై క్షతగాత్రులవుతున్న వారి సంఖ్య ఎక్కువే. ఆయా ప్రమాదాలు వేర్వేరుగా జరిగినా రహదారిపై ములుపులు, వాహనదారులు మద్యం సేవించి ఉండడం, వాహనాలు వేగంగా నడపడమే కారణాలుగా ఉంటున్నాయి.

#### భద్రత చర్యలు ఏవి..?

తరచూ ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖలు విఫలమవుతున్నాయి. గతంలో అటవీ మార్గాలలో రహదారుల మలుపుల్లో రేడియం స్టిక్కర్లను అంటించారు. కొంత కాలానికే ఇవి కనిపించకుండా పోయాయి. మలుపుల వద్ద రహదారులకు ఇరువైపులా చెట్లు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేని పరిస్థితి ఉంది. ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నా జరిమానాలకే పరిమితమవుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదాలు నియంత్రించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

#### నిత్యం తనిఖీలు

ప్రమాదాలు జరగకుండా నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. రవీంద్రనగర్ మార్గంలో ప్రమాదాల సంఖ్య తగ్గింది. కదంబా, ఖర్జెల్లి అటవీ మార్గంలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడానికి రోడ్డు రవాణా శాఖకు నివేదికలు అందిస్తాం. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. రహదారి భద్రత నియమాలు అందరూ పాటించాలని పోలీసు శాఖ తరఫున కోరుతున్నాం.

– ఇస్లావత్ నరేశ్, ఎస్సై, చింతలమానెపల్లి

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు మండలంలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఏడు చెక్కులు అందజేశారు. సోమవారం ఆయా లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు జాడి దిగంబర్, వసీఉల్లా ఖాన్, కోరితే తిరుపతి, బి.శ్యాంసుందర్, నికాడి శ్రీనివాస్, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సంతలో అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న సభ్యులు

కౌటాల: కౌటాల వారసంతలో సోమవారం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు ట్రస్ట్ సభ్యులు అంబలి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రోజురోజుకు వేడి తాకిడి పెరుగుతుందని, ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి అంబలి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రతీ సోమవారం కౌటాలలో అంబలి పంపిణీ చేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిర్పూర్ ప్రజలకు సేవ చేయడమే కోనేరు ట్రస్ట్ ఉద్దేశమన్నారు. ట్రస్ట్ సభ్యులు సంతోష్, శ్రీనివాస్, బాపు, రవీందర్‌గౌడ్, భీమయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దర్జాగా కబ్జా..!



కౌటాల మండల కేంద్రంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలం గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంటుంది. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఈ విలువైన స్థలంలో కొందరు అక్రమార్కులు భవనాలు నిర్మించారు. మరికొందరు అక్రమంగా టేలాలు ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ లేకుండా పోతోంది.


కౌటాల పాత ఐకేపీ కార్యాలయం ఎదుట వెలసిన టేలాలు

- కౌటాలలో యథేచ్ఛగా ఆక్రమణలు
- కల్వర్టులపై కట్టడాలు
- ప్రభుత్వ భూముల్లో కబ్జాలు
- పట్టించుకోని అధికారులు

కౌటాల: కౌటాలలో ప్రభుత్వ స్థలాల కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. రాజకీయ నాయకుల అండదండలు, అధికారుల పట్టింపులేని తనం వల్ల అక్రమార్కులకు అడ్డులేకుండా పోతోంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు, కాల్వలు, కల్వర్టులను సైతం వదలడం లేదు. గతంలో తొలగించిన చోట మళ్లీ కట్టడాలు నిర్మిస్తూ అధికారులకు సవాలు విసురుతున్నారు. కొన్నిసార్లు అధికారులు అడ్డు చెప్పినా, అంతా సద్దుమణిగాక మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

#### పట్టించుకోని అధికారులు

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో ఒక గుంట స్థలం కొనుగోలు చేయాలంటే ధర రూ. 10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంది. ఇతర ప్రాంతాల్లో రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు ఉంది. దీంతో పలువురు మండల కేంద్రంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. భవనాల నిర్మాణాలకు అనుమతులు జారీ చేసే సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అధికారులు అనుమతులు ఇస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు, ఆలయాల భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

#### ప్రభుత్వ భూములకు రక్షణేది..?

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 130 సర్వే నంబర్‌లో ఎకరంన్నర ప్రభుత్వ భూమి ఉంది. మరో చోట నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. దీంతో కౌటాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వినియోగంలో లేదు. దీంతో పలువురి భూ కబ్జాదారుల కన్ను ఈ స్థలంపై పడింది. గుట్టుచప్పుడు కాకుండా స్థలం ఆక్రమించుకొని రాత్రికిరాత్రే కట్టడాలు నిర్మించారు. పక్కనే ఉన్న 123 సర్వే నంబర్‌ను చూపెడుతూ, ప్రభుత్వ స్థలం 130 సర్వే నంబర్‌లో ప్లాట్లు వేసి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వ స్థలం ఐదు ఎకరాల్లో ప్రస్తుతం మూడు ఎకరాలు అన్యాక్రాంతమైంది. 2013లో అప్పటి ప్రత్యేకాధికారి కబ్జాలకు పాల్పడిన వారికి నోటీసులు అందజేసి, అక్కడ నుంచి ఖాళీ చేయించారు. అనంతరం మళ్లీ కబ్జాలు ఏటా పెరిగి సంతకు స్థలం లేకుండా పోయింది. దీంతో స్థలం సరిపోక రోడ్డుకు ఇరువైపులా సంత ఏర్పాటు చేస్తున్నారు. కౌటాల పాత ఐకేపీ కార్యాలయం భవన స్థలం కూడా కబ్జాకు గురవుతోంది. కార్యాలయం ఎదుట అక్రమంగా టేలాలు నిర్మించారు. ఇటీవల ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఈ భవనాన్ని పరిశీలించి భవనం ఎదుట ఉన్న నిర్మాణాలకు, టేలాలకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చూస్తున్నామని, కల్వర్టులు, కాల్వలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు నిర్మించి ఉంటే వాటిని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని రెవెన్యూ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


లింగాపూర్: రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈవో ఖలీల్


కౌటాల: అవగాహన కల్పిస్తున్న ఏఈవో కవిత

లింగాపూర్: మండలకేంద్రానికి చెందిన ఆయా గ్రామాల రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం లింగాపూర్, కంచన్‌పల్లి రైతువేదికల్లో సంప్రదించాలని ఏఈవో ఖలీల్ అన్నారు. వివరాలు నమోదు చేసుకోవడం వల్ల పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, సాగు సలహాలు, ఇతర పథకాలు అందించేందుకు వీలు ఉంటుందన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌లు సమర్పించాలని పేర్కొన్నారు. అలాగే ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలని సూచించారు.

కౌటాల: అర్హులైన రైతులు రైతు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మొగడ్‌దగడ్ ఏఈవో కవిత అన్నారు. సోమవారం మండలంలోని వీర్దండి గ్రామంలో రైతులకు రైతు గుర్తింపు కార్డుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, సెల్‌ఫోన్ నంబర్లను తెలిపారు.

# సుందరయ్య జీవితం ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణరైతాంగ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భూస్వామి కుటుంబంలో పుట్టి కూడా చిన్ననాటి నుంచి అంటరానితనం, కులవివక్ష, అసమానతలను ఆయన సహించేవారు కాదన్నారు. కుల వ్యవస్థను మార్చాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు పెట్టిన సుందరరామరెడ్డి పేరును సుందరయ్యగా మార్చుకున్న గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లిన ఒకే ఒక వ్యక్తి సుందరయ్య అని గుర్తు చేశారు. వందల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిపెట్టారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. నాయకులు మిట్టపల్లి సుదర్శన్, చంద్రయ్య, రమేశ్, సునీల్, సంజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసమే 'మై ఆటో సేఫ్'


క్యూఆర్ కోడ్ పంపిణీ చేస్తున్న సీఐ రహీంపాషా

నార్నూర్: మహిళల భద్రత కోడ్‌ను ఆటోలకు ఇస్తున్నట్లు సీఐ రహీంపాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆటో యూనియన్ భవన్ వద్ద ఆటోలకు మై ఆటో సేఫ్ పేరుతో క్యూఆర్ కోడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆటోలో ప్రయాణించేటప్పుడు ఏదైనా ప్రమాదం అనిపించినా, ఆకతాయిలు ఇబ్బంది పెట్టినా క్యూఆర్ కోడ్‌స్కాన్ చేస్తే 100 నంబర్‌కు డయల్ అవుతుందన్నారు. దీంతో మహిళలకు భద్రత కలుగుతుందన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, పోలీస్ సిబ్బంది రవీందర్ తదితరులు ఉన్నారు.

### వరి గడ్డి దగ్ధం

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన డొంగ్రే గణపతికి చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తన పొలంలో పశువులకు మేత కోసం వరి గడ్డి కుప్పను నిల్వ చేసినట్లు తెలిపారు. సోమవారం తన పొలం పక్క చేనులో మిరప కర్రలకు చునార్కర్ బాలాజీ నిప్పటించాడన్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న వరి గడ్డికి నిప్పంటుకుందని, క్షణాల్లోనే భారీగా మంటలు చెలరేగాయని వాపోయాడు. వెంటనే ఫైర్‌ఇంజిన్‌కు సమాచారం అందించినప్పటికీ కాగజ్‌నగర్ నుంచి వాహనం వచ్చేలోపే రూ. 8 వేల విలువ గల వరిగడ్డి పూర్తిగా దగ్ధమైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

# 'యశ్వంత్‌నాయుడు గ్యాంగ్‌ను కఠినంగా శిక్షించాలి'


మాట్లాడుతున్న అశోక్ మహోల్కర్

వాంకిడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని కళాశాలలో బీటెక్ చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిపై అదే కళాశాలలో చదువుకుంటున్న అగ్రవర్ణానికి చెందిన యశ్వంత్ నాయుడు అనే విద్యార్థి రౌడీ షీటర్లతో కలిసి విచక్షణరహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో విలేకరులతో మాట్లాడారు. రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని, విద్యార్థి దశలోనే అనేక మంది యువకులు దాడులకు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఆర్గనైజర్ విజయ్ ఉప్రె, ఎస్ఎస్‌డీ జిల్లా బాధ్యులు దుర్గం సందీప్, అంబేడ్కర్ సంఘం నాయకులు హంసరాజ్, ప్రతాప్, విలాస్, రమేశ్, చింటూ, పోచాలు, శివాజీ, డిలాజీ, మారుతి, చంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించాలి


జొన్న పంట పరిశీలిస్తున్న నాయకులు

నార్నూర్: మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డులో రైతులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా మార్కెట్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి రాథోడ్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో రైతులు తీసుకొచ్చిన జొన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు కోట్ల రూపాయల లాభం వస్తున్నప్పటికీ రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మంచినీళ్ల సౌకర్యం కల్పించలేని దుస్థితి ఉందన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

### యువ నాయకుడికి దళితరత్న అవార్డు


దళితరత్న అవార్డు అందుకున్న కొర్రెల్ల మహేందర్

నార్నూర్: మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అన్నా భావుసాతె కమిటీ అధ్యక్షుడు కొర్రల మహేందర్ సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దళితరత్న అవార్డు అందుకున్నారు. పేద ప్రజల కోసం గత 20సంవత్సరాల నుంచి చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దళితరత్న అవార్డుతో సత్కరించింది. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కోరేపల్లి శ్రీనివాస్ మాదిగ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899